## అమెరికా కంపెనీ నుంచి లంచాలు..

# ఐవోసీ దర్యాప్తు

న్యూఢిల్లీ: 'ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్' (ఐవోసీ) నుంచి కాంట్రాక్ట్ దక్కించుకునేందుకు అమెరికా రసాయన ఉత్పత్తుల కంపెనీ లంచాలు ఇచ్చిందన్న ఆరోపణలు భారత్‌లో కలకలం రేపాయి. దీనిపై ఐవోసీ నిజ నిర్ధారణకు సిద్ధమైంది. '2009లో జరిగిట్లుగా భావిస్తున్న ఘటనకు సంబంధించి అంతర్గత నిజనిర్ధారణ సమీక్షను ఐవోసీ ప్రారంభించింది. ఆరోపణల చుట్టూ ఉన్న వాస్తవాలను అర్థం చేసుకోవడానికి, తీసుకోవలసిన తగిన చర్యలను నిర్ణయిస్తాం' అని ఐవోసీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నది. ఐవోసీ చట్టబద్ధమైన, పారదర్శక పాలనకు కట్టుబడి ఉందని తెలిపింది. సుమారుగా 15 ఏండ్ల క్రితం అమెరికా కంపెనీ 'ఆల్బెమార్లే కార్పొరేషన్' ఐవోసీ అధికారులకు లంచాలు ఇచ్చి, కాంట్రాక్ట్‌లు పొందారన్నది ప్రధాన ఆరోపణ. దీనిపై అమెరికాలో 2017లో కేసు నమోదుకాగా..సెప్టెంబర్ 2023న 'ఆల్బెమార్లే కార్పొరేషన్' కంపెనీ సెటిల్‌మెంట్ చేసుకుంది. 198 మిలియన్ డాలర్లు (రూ.1682కోట్లు) జరిమానా చెల్లించింది. 2009 నుంచి 2011 మధ్యకాలంలో 'ఆల్బెమార్లే కార్పొరేషన్' కంపెనీ ఏజెంట్స్ ఐవోసీ అధికారులకు 1.14 మిలియన్ డాలర్లు (రూ.9.6 కోట్లు) లంచాలు ఇచ్చారన్న విషయం, అమెరికాలో కేసు సెటిల్‌మెంట్ అయిన సంగతి ఇటీవలే వెలుగులోకి వచ్చింది.

## హాస్పిటల్ భవనాన్ని ఢీకొన్న హెలికాప్టర్

### టర్కీలో నలుగురు మృతి

అంకారా: వైద్యులతో బయల్దేరిన అంబులెన్స్ హెలికాప్టర్ ఘోర ప్రమాదానికి గురైంది. రోగిని తీసుకొచ్చేందుకు టేకాఫ్ అయిన హెలికాప్టర్ హాస్పిటల్ భవనాన్ని ఢీకొట్టి, కుప్పకూలింది. అందులో ఉన్న ఇద్దరు పైలట్లు, ఒక డాక్టర్, ఒక ఆరోగ్య సంరక్షకుడు చనిపోయారు. టర్కీ ఆగ్నేయప్రాంతంలోని ముగ్లా నగరంలో ఆదివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. అంట్యాలా ప్రావిన్స్‌లో ఉన్న రోగిని దవాఖానకు తరలించేందుకు అంబులెన్స్ హెలికాప్టర్ బయల్దేరగా, కొద్ది నిమిషాలకే కుప్పకూలింది. టేకాఫ్ అవుతున్న సమయంలో దట్టమైన పొగమంచు ఉండటం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ముగ్లా నగర గవర్నర్ ఇడ్రిస్ అక్బియాక్ తెలిపారు.

## వస్తువుల బరువు తగ్గించే బ్యాక్‌ప్యాక్

బీజింగ్: బ్యాగ్‌లో సర్దుకున్న వస్తువుల బరువును తగ్గించే వినూత్నమైన 'బ్యాక్‌ప్యాక్'ను చైనా పరిశోధకులు తయారుచేశారు. రెగ్యులర్ బ్యాగ్‌లతో పోల్చితే, కొత్త డిజైన్‌తో తయారుచేసిన ఈ బ్యాక్‌ప్యాక్‌లు తేలిగ్గా ఉంటాయని, శ్రమ శక్తిని 11% తగ్గించాయని పరిశోధకులు చెబుతున్నారు. బ్యాగ్‌ను ధరించటాన్ని సౌకర్యవంతం చేసిందని, ఎక్కువ దూరం బరువులు మోయగలిగేలా సహాయపడిందని 'నమూనా ప్రయోగం'లో తేలింది. 'హర్బిన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' రోబోటిక్స్, సిస్టమ్స్ ల్యాబ్ పరిశోధకుల బృందం తయారుచేసిన 'సెల్ఫ్ లైటెనింగ్ బ్యాక్‌ప్యాక్' నమూనా ప్రయోగాల్లో అనూహ్య ఫలితాలు వెలువడ్డాయి. బ్యాగ్‌లోని వివిధ రకాల వస్తువులు నిలువుగా కదలటం వల్లే ఆ బ్యాగ్ బరువుగా మారుతున్నదని, దీనిని నివారించిట్టయితే బ్యాగ్ తేలిగ్గా మారుతుందన్న విషయాన్ని పరిశోధకులు కనుగొన్నారు. వస్తువుల కదలికలను నియంత్రించే 'మైక్రోకంట్రోలర్ల'ను బ్యాక్‌ప్యాక్‌లో ఏర్పాటుచేస్తూ ఒక కొత్త డిజైన్‌తో కూడిన బ్యాగ్‌ను రూపొందించారు. వీటిని త్వరలోనే మార్కెట్లోకి తీసుకొచ్చే ఆలోచన ఉందని పరిశోధకులు చెప్పారు.























